

నక్షత్ర హారతి సమర్పణ

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామికి రూ.1,09,990 విలువైన వెండి నక్షత్ర హారతి సమర్పించినట్లు కె.కృష్ణ సాయినాథ్, సత్యసాయి పావనీ దంపతులు (ర్యాలి) తెలిపారు.




క్రీడా సంరంభానికి వేళాయె..

పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్‌-19 లాన్‌ టెన్నిస్‌ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

10లో

10,175 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 10,175 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.20 అడుగుల నీటిమట్టం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్‌

వారి నేత్రాలు అజరామరం



పోతుల సత్యకుమారి



వెంకట బ్రహ్మానందం

తాళ్లరేవు: అనారోగ్యంతో మృతి చెందిన ఇరువురి నేత్రాలను బుధవారం దానం చేశారు. మండలంలోని పోలేకుర్రు గ్రామానికి చెందిన పోతుల సత్యకుమారి (65) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకట రమణ సూచనల మేరకు ఆమె భర్త రిటైర్డ్‌ ఆర్మీ ఉద్యోగి పోతుల బలరామకృష్ణ, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన వనిమిశెట్టి వెంకట బ్రహ్మానందం (85) బుధవారం ఉదయం మృతి చెందారు. బ్రహ్మానందం కుటుంబ సభ్యులకు వెంకటరమణ అవగాహన కల్పించడంతో వారి అంగీకారంతో బ్రహ్మానందం నేత్రాలను కూడా దానం చేశారు. ఆయా కుటుంబ సభ్యులను గ్రామ నాయకులు జి.కృష్ణప్రసాద్‌, ధూళిపూడి హరి, అందే కాశీరాజు, ధూళిపూడి నాగేంద్రప్రసాద్‌, హరి, ఉంగరాల కృష్ణ, యేడిద సురేష్‌, ఆనాల చక్రం, గంగిరెడ్డి రాము తదితరులు అభినందించారు.

సంక్రాంతి సెలవుల పొడిగింపు

రాయవరం: ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేట్‌ పాఠశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులను మరో మూడు రోజులు పొడిగించింది. తొలుత ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకూ ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. ఈ నెల 19న పాఠశాలలు పునః ప్రారంభం కావాల్సి ఉండగా, తల్లిదండ్రులు, విద్యార్థుల విజ్ఞప్తులను పురస్కరించుకుని మరో మూడు రోజులు సెలవులను పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ నెల 21 వరకూ సంక్రాంతి సెలవులను ఇవ్వగా, 22న సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. జిల్లా పరిధిలోని 2,035 ప్రభుత్వ, ప్రైవేట్‌ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న 2.08 లక్షల మంది విద్యార్థులకు సంక్రాంతి సెలవులు వర్తిస్తాయి.

ఇక శని, ఆదివారాల్లోనూ రైల్వే రిజర్వేషన్‌ సౌకర్యం

ఎంపీ అనురాధ చొరవ



అమలాపురం టౌన్‌: అమలాపురం పోస్టాఫీసుల్లో రైలు టిక్కెట్ల బుకింగ్‌ కోసం ప్యాసింజర్‌ రిజర్వేషన్‌ సిస్టమ్‌ (పీఆర్‌ఎస్‌) సేవలు ఇక నుంచి శని, ఆదివారాల్లో పోస్టాఫీస్‌ సెలవు దినాల్లో సైతం అందేలా ఎంపీ చింతా అనురాధ చొరవతో సాకారం అవుతోంది. 22 ఏళ్లుగా అమలాపురం సర్క్యులర్‌ బజార్‌ (మున్సిపల్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌)లో ఉన్న రైల్వే రిజర్వేషన్‌ కౌంటర్‌ను కొన్ని నెలల కిందట స్థానిక హెడ్‌ పోస్టాఫీసుకు బదలాయించిన సంగతి తెలిసిందే. గతంలో రిజర్వేషన్‌ కౌంటర్‌లో సెలవు దినాల్లో సైతం సేవలు అందేవి. అయితే పోస్టాఫీసుకు మారాక సెలవు దినాల్లో వినియోగదారులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎంపీ అనురాధకు దృష్టికి పలువురు తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీ ఈ నెల 2న పోస్ట్‌ మాస్టర్‌ జనరల్‌ రాములుకు లేఖ రాశారు. ఈ మేరకు పోస్ట్‌ మాస్టర్‌ జనరల్‌ చర్యలు తీసుకున్నారు. రైల్వే రిజర్వేషన్‌ కౌంటర్‌ శనివారం పూర్తి స్థాయిలో, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పని చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సౌకర్యంపై నెల రోజుల పాటు ట్రయల్‌ రన్‌ నిర్వహిస్తారు. రిజర్వేషన్‌ కౌంటర్‌ రద్దీని అంచనా వేసి అప్పుడు పొడగింపుపై తదుపరి ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ఎంపీ క్యాంపు కార్యాలయం పేర్కొంది.

20 నుంచి రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

ప్రకాశం నగర్‌ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి బండ్‌ రోడ్డులోని వైఎంఏ హాలులో రాష్ట్ర స్థాయి ఓపెన్‌ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీ కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యంగ్‌మెన్స్‌ వైశ్యా అసోసియేషన్‌, ఎంకే చెస్‌ ఆకాడమీల సౌజన్యంతో జరిగే ఈ పోటీల్లో మొదటి 20 మంది క్రీడాకారులకు రూ.50,100 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన దలిచిన క్రీడాకారులు తమ పేర్లను ఏపీ చెస్‌ డాట్‌ ఓఆర్‌జీ వెబ్‌ సైట్‌లో ఈ నెల 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9848374133 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కలల వారధి... నెరవేరుతోంది

- జిల్లాలో నాలుగు లంక గ్రామాలకు ప్రయోజనం
- రూ.49.50 కోట్లు కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వరదల సమయంలో ప్రజల అవస్థలకు చెక్‌
- ఆగమేఘాలపై పనులు ప్రారంభం



వరద నీటిలోంచి వస్తున్న లంక వాసులు (ఫైల్‌)



ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఫ్లడ్‌ బ్యాంకుపైకి పి.గన్నవరం కాలువపై వంతెన నిర్మాణం

సాక్షి, అమలాపురం/ పి.గన్నవరం: దశాబ్దాల నాటి కల అది.. గత ప్రభుత్వాల్లో అనేక శంకుస్థాపనలు జరిగినా పనులు ముందుకు కదలని పరిస్థితి.. ఇక వారధి నిర్మాణంపై స్థానికులు ఆశలు వదులుకున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడం వరంలా మారింది. కలగా మారిన 'లంక వారధి' నిర్మాణం వాస్తవ రూపం దాల్చడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

జిల్లాలో గోదావరి నదీపాయల మధ్య పలు లంక గ్రామాలు ఉన్నాయి. పి.గన్నవరం మండలం వశిష్ట నదీపాయ మధ్య ఉన్న గంటి పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, బూరుగులంకల గ్రామాలు కోనసీమ జిల్లాతో పాటు పశ్చిమగోదావరి జిల్లాల మధ్య ఉన్నాయి. రెవెన్యూ లెక్కల ప్రకారం 3,500 మంది వరకూ ఉండగా, ఏడు వందల ఎకరాల వరకూ లంక భూముల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. అక్కడి ప్రజలు గోదావరిలో నీరు ఉన్న సమయంలో పడవలను ఆశ్రయించాల్సిందే. వేసవి సమయంలో ఇసుక తెన్నులపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వరద పెరిగితే రెండు చోట్ల పడవలు మారాలి. వరద ఉధృతి ఎక్కువగా ఉంటే ఏటిగట్టు నుంచి మట్టి గ్రామాలకు నేరుగా పడవలపై వెళ్లాలి.

ఎన్నో ఇబ్బందులు

- వరదల సమయంలోనే కాదు.. నదీపాయల మధ్య నీరు ఉన్న సమయంలో కూడా స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జూలై నుంచి అక్టోబర్‌ వరకూ ఆ గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే కత్తిమీద సామే. వరదల్లో ఏటికి ఎదురీదుతూ పడవలపై చిన్నారుల నుంచి యువత వరకూ గోదావరిలో రాకపోకలు సాగించాల్సిందే.
- ఇల్లు నిర్మించుకోవాలంటే ఇసుక, కంకర, ఇటుక, సిమెంట్‌ వచ్చేదారి ఉండేది కాదు. అవన్నీ రావాలంటే ఏటా డిసెంబర్‌ నుంచి మే నెల వరకూ ఎదురు చూడాల్సిందే. ఆ సమయంలో గోదావరిలో నీరు తగ్గి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ఇసుక రహదారే శరణ్యం.
- ఇక్కడ లంక భూముల్లో పండే పంటలను ఏడాదిలో సగం రోజులు పడవలపై దాటించాలి. పాడికి సైతం ఇదే పరిస్థితి. ఈ కారణంగా వ్యవసాయ ఉత్పత్తులకు వచ్చే ధర తగ్గడం... వరదల సమయంలో అయినకాడకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఉంది.
- కక్కొచ్చినా... కల్యాణం వచ్చినా... చివరకు పురిటి నొప్పులు వచ్చినా.. అనారోగ్యం పాలైనా వరదల సమయంలో అక్కడి వారు ఆస్పత్రికి చేరుకోవడానికి నరకయాతన పడేవారు.

శంకుస్థాపనలతో సరి

ఇక్కడ వంతెన నిర్మాణాన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నినాదంగా మార్చేశాయి. 2009–10 ఎన్నికల ముందు రూ.19 కోట్లతో అప్పటి కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నాటి అమలాపురం ఎంపీ జీవీ హర్షకుమార్‌లు ఇక్కడ వంతెనలకు శంకుస్థాపన చేశారు. పీఎంజీఎస్‌వై మిస్లెనియస్‌ నిధులతో నిర్మాణం చేస్తామని చెప్పారు.

- 2019 ఎన్నికల ముందు టీడీపీ ఎమ్మెల్యే, దివంగత పులపర్తి నారాయణమూర్తి ఆధ్వర్యంలో నాటి ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. పనులకు టెండరు ఖరారు కాకుండా శంకుస్థాపన చేయడం విశేషం.

సీఎం జగన్‌ ఆదేశాలతో వాస్తవ రూపం

గోదావరికి గత ఏడాది రికార్డు స్థాయిలో వరదలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతం అధికంగా దెబ్బతింది. అదే ఏడాది జూలై 26న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఈ గ్రామాల్లో పర్యటించారు. వరదల బారిన పడిన లంక గ్రామాల్లో బాధితులను పరామర్శించిన తొలి సీఎం జగన్‌ ఒక్కరే. ఆ సమయంలో ప్రజలు ఇక్కడ వంతెన నిర్మించాలని కోరారు. దీంతో వంతెన నిర్మాణానికి సీఎం జగన్‌ హామీ ఇచ్చారు. ఇలా ప్రతిపాదనలకే పరిమితమైన వంతెన వాస్తవ రూపంలోకి వచ్చింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న టెండర్లు ఖరారు కావడం, పనులు ప్రారంభించడం ఆఘమేఘాలపై సాగిపోయింది. ప్రధాన వంతెనకు అనుసంధానంగా ఉచ్చులవారిపేట వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఏటిగట్టు మీదకు పి.గన్నవరం పంట కాలువపై మైనర్‌ వంతెన నిర్మాణ పనులు మొదలయ్యాయి. అలాగే నదీపాయపై నిర్మించే ప్రధాన వంతెనకు సంబంధించి పియర్‌ వన్‌కు వెల్‌ కెర్బ్‌ నిర్మాణం ప్రారంభమైంది. దీంతో ప్రధాన వంతెన పనులు మొదలైనట్టయ్యింది.

వంతెన నిర్మాణం ఇలా..

పంచాయతీరాజ్‌ ఇంజినీరింగ్‌ ప్రాజెక్టు విభాగం ఇక్కడ రూ.49.50 కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టనుంది. వంతెన మొత్తం పొడవు 320 మీటర్లు. వంతెనను ఎనిమిది కానాలతో నిర్మించనున్నారు. కానాల మధ్య దూరం 40 మీటర్లు. ఇందులో ఏడు పిల్లర్లు కాగా, రెండు అబర్ట్‌మెంట్లు ఉన్నాయి. వంతెన వెడల్పు 7.50 మీటర్లు (సిమెంట్‌ రెయిలింగ్‌తో కలిపి). వంతెన నిర్మాణం పూర్తయితే ఈ లంక గ్రామాల్లో గణనీయమైన మార్పు రానుంది. వ్యవసాయ ఉత్పత్తులను వేగంగా రవాణా చేయడంతో పాటు స్థానికుల వాహనాలపై రాకపోకలు సాగించనున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. భూముల ధర సైతం డెల్టా ప్రాంతాలతో సమానంగా పెరగనుంది.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



వంతెన నిర్మించాలని దశాబ్దాల నుంచి కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. మమ్మల్ని పరామర్శించేందుకు వచ్చిన జగనన్నకు వంతెన విషయం చెప్పాం. ఇచ్చిన హామీ మేరకు పనులు ప్రారంభించిన జగనన్నకు మా లంక గ్రామాల ప్రజలు రుణపడి ఉంటాం. వరదల, అర్ధరాత్రి సమయాల్లో చాలా ఇబ్బంది పడుతున్నాం. అనారోగ్యం వస్తే పడరాని పాట్లు పడేవాళ్లం. వంతెన పూర్తయితే చాలా వరకూ మేలు జరుగుతోంది.

– విప్పర్తి శేషారత్నం, జి.పెదపూడిలంక

ఈ బాధలు తప్పుతాయి



వరదొస్తే కళాశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రమాదాలు జరుగుతాయని భయపడుతున్నాం. ఇక్కడ పడవలు దాటి గంటి పెదపూడి గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి బస్సుల్లో కళాశాలకు వెళ్తున్నాం. తిరిగి వచ్చేసరికి ఆలస్యమైతే చీకట్లో పడవలు దాటేందుకు ఇబ్బంది పడుతున్నాం. వంతెన నిర్మాణం పూర్తి చేస్తే ఈ బాధలు తప్పుతాయి.

– దొడ్డా శివ, బూరుగులంక, బి.టెక్‌ తొలి సంవత్సరం

ఎంతో ఆనందంగా ఉంది



నేను మూడు ఎకరాల లంక భూమిని కౌలుకు సాగు చేస్తున్నాను. వరదల సమయంలో పండించిన పంటలు బయటకు తరలించేందుకు వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఖర్చు పెరిగిపోతోంది. చాలా శ్రమ పడాల్సి వస్తోంది. వంతెన నిర్మించాలని కోరినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. సీఎం జగన్‌ చొరవతో వంతెన పనులను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది.

– కటికిరెడ్డి వెంకటేశ్వర్లు, కౌలు రైతు, బూరుగులంక

అనువైన ప్రాంతంలో నిర్మాణం



సాంకేతికంగా అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి వంతెన నిర్మాణం చేపట్టాం. మద్రాస్‌ ఐఐటీ నిపుణులు సూచించిన స్థలంలో ఇక్కడ పనులు చేస్తున్నాం. వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత వాసుల రెండు దశాబ్దాల నాటి కల నెరవేరుతోంది. ప్రజల ఇబ్బందులు తీరతాయి.

– అన్యం రాంబాబు, డీఈఈ, పంచాయతీరాజ్‌ ప్రాజెక్టు విభాగం

సేవకులలో మూడు రకాలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్‌): సేవకులను మూడు రకాలుగా విభజించవచ్చని, వీరిలో హనుమంతుడు ఉత్తమశ్రేణికి చెందినవాడని రాముడు హనుమంతుని గురించి యుద్ధకాండ, మొదటి సర్గలో చెబుతాడని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. బుధవారం ఆయన హిందు సమాజంలో 36వ రోజు ప్రవచనాన్ని నిర్వహించారు. హనుమంతునికి రామస్వామి పరిష్వంగన భాగ్యాన్ని ప్రసాదించాడు. సీత జాడను హనుమంతుడు తెలుసుకోవడం వలన నేను, లక్ష్మణుడు, రఘువంశీయులందరూ రక్షింపబడ్డారు అని రాముడు పేర్కొంటాడని సామవేదం అన్నారు. నిజమైన భక్తుడు భగవంతుని నుంచి ఏమి కోరతాడంటే, భగవంతుడే కావాలని..ఏ పరమాత్మ పాదాలపై ఒక తులసిదళం వేస్తే భక్తుడు విష్ణుపథాన్ని చేరగలడో, అటువంటి పరమాత్మ ఆలింగన భాగ్యాన్ని హనుమంతుడు పొందాడు. వానరులు సజల నేత్రాలతో చూస్తున్నారు, నింగినుంచి చూస్తున్న దేవతలకు సగం రాముడు, సగం హనుమంతుడు కనపడుతున్నారు, 'హనుమద్రాముడు' కనపడుతున్నాడు. రాముని పేరు పెట్టుకుంటే కష్టాలు వస్తాయని, సీత పేరు పెట్టుకుంటే దుఃఖం మిగులుతుందని కొందరి అపోహ. ఆమె ముగ్గురమ్మలలో ఒకరు కాదు, ముగ్గురమ్మలు ఒకటైన తల్లి అని సామవేదం అన్నారు. సాగర తీరానికి చేరుకున్న రామదండు సాగరాన్ని దాటడం ఎలాగో చెబుతూ రాముడు 'నా తపశ్శక్తితో సాగరంపై వారధి నిర్మించగలను, లేదా సాగరాన్ని ఇంకింప చేయగల'నని ప్రకటిస్తాడు. లంకానగర రక్షణ వ్యవస్థ చాలా బలంగా ఉన్నదని, తాను వంతెనలను, అగడ్తలను కూల్చివేశానని, రాక్షస సైన్యంలో పాతిక భాగాన్ని తుదముట్టించానని హనుమ రామునికి విన్నవిస్తాడు. అక్కడ లంకలో రాక్షసరాజు రావణుడు హనుమచేతిలో భంగపడినందుకు తల వంచుకుని రాక్షసవీరుల సలహాలను అడుగుతాడు. రాక్షసవీరులందరూ మనం యుద్ధానికి సంసిద్ధులుగా లేనందున హనుమ దాడి చేయగలిగాడని, ఇప్పుడు వానర సైన్యాన్ని నిరోధించగలమని బీరాలు పలుకుతారు. విభీషణుడు వారిని వారిస్తాడని సామవేదం వివరించారు.

అంబేడ్కర్‌ ఆలోచనా విధానం అనుసరణీయం

- కలెక్టర్‌ హిమాన్షు శుక్లా
- విజయవాడలో విగ్రహం ఏర్పాటు గర్వకారణం



కలెక్టరేట్‌లో అంబేడ్కర్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్‌ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

అమలాపురం రూరల్‌: ప్రపంచ మేధావి అంబేడ్కర్‌ ఆలోచనా విధానం యువతకు అనుసరణీయమని, ఆ మహనీయుని సేవలు గుర్తుండిపోయేలా విజయవాడలో 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం అందరికీ గర్వకారణమని కలెక్టర్‌ హిమాన్షు శుక్లా అన్నారు. విజయవాడలో అంబేడ్కర్‌ విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సామాజిక సమత సంకల్ప యాత్రను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్‌ పాల్గొనగా జిల్లా అధికారులు, అంబేడ్కర్‌ సంక్షేమ సంఘాలకు చెందిన అభిమానులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి ఫ్లెక్సీపై అంతా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ నేడు భారతీయులు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే, అంబేడ్కర్‌ చలువే కారణమన్నారు. రాజ్యాంగం ఎంతో గొప్పదని, మన దేశం ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. 125 అడుగుల అంబేడ్కర్‌ కాంస్య విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ నెల 19న జరిగే అంబేడ్కర్‌ విగ్రహ ఆవిష్కరణకు లక్షలాది మంది ప్రజలు వస్తున్నారని, అందులో అంతా పాలుపంచుకోవాలని కోరారు. జిల్లాలో సుమారు నాలుగు వేల మంది విజయవాడకు వెళ్లేందుకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 బస్సుల చొప్పున ఏడు నియోజకవర్గాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉచితంగా కల్పించామన్నారు. దీనికి ఎంపీడీఓలు నోడల్‌ అధికారిగా వ్యవహరిస్తారని అన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ దేశ చరిత్రలో సువర్ణాధ్యాయంగా ఈ ఆవిష్కరణ నిలుస్తుందన్నారు. కోనసీమకు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాగా నామకరణం చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్‌ ఆశయాలను త్రికరణ శుద్ధిగా అందరూ ఆచరించడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, హితకారిణి సమాజం చైర్‌ పర్సన్‌ కాశీ బాల మునికుమారి, వక్ఫ్‌ బోర్డు అధ్యక్షుడు షేక్‌ అబ్దుల్‌ ఖాదర్‌, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి, గెద్దం సంపత్‌రావు, మట్ట శైలజ, దళిత సంఘాల ప్రతినిధులు జంగా బాబూరావు, డీబీ లోక్‌, మోకాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంతోషాల సంక్రాంతి

- 'తూర్పు'లో ఉత్సాహంగా మూడు రోజుల పండగ
- సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులు
- ప్రతి ఇంటా వెల్లివెరిసిన ఆనందాలు
- ముగ్గుల పోటీల్లో రంగులద్దిన అతివలు
- పోలీసులు కట్టడి చేసినా ఆగని కోడి పందేలు
- రెస్టారెంట్లు, బ్రాందీ షాపులు ఫుల్‌



ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు



పెరవలి మండలం ఖండవల్లి బరిలో తలపడుతున్న కోళ్లు

సాక్షి, రాజమహేంద్రవరం: తెలుగింట సంక్రాంతికి ప్రత్యేకత ఉంది. అల్లుళ్ల పండగగా ఖ్యాతి గడించిన సంక్రాంతిని ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఎప్పటి లాగే ఈ ఏడాది కూడా జనం సంక్రాంతి పండగను ఘనంగా, అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మూడు రోజల ముచ్చటైన పండగ సందర్భంగా ఆనందం గోదావరైంది. ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాల నిమిత్తం సుదూర ప్రాంతాలకు తరలివెళ్లిన స్థానికులు. పండగ వేళ రెక్కలు కట్టుకుని సొంతూళ్లలో వాలిపోయారు. కొత్త, పాత అన్న తేడా లేకుండా అల్లుళ్లు అత్తారింట్లో కొలువుదీరారు. ఫలితంగా ఎక్కడ చూసినా బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, చిన్నారుల కోలాహలమే దర్శనమిచ్చింది. ఇంటిల్లిపాదీ పండగను ఆనందంగా జరుపుకున్నారు. పిండివంటల రుచులను ఆస్వాదిస్తూ.. ఆటపాటల్లో మునిగి తేలారు. ఇళ్లల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడిపందేలు, సినిమాలు, రెస్టారెంట్లలో ఆనందంగా గడిపారు. మరికొందరు ప్రకృతిని ఆస్వాదిస్తూ కార్లు, ద్విచక్ర వాహనాల్లో తిరిగారు. కుటుంబ సభ్యులు కలుసుకుని కష్టసుఖాలను కలబోసుకున్నారు.

ముచ్చటగొలిపే ముగ్గుల పోటీలు

సంక్రాంతి అంటేనే ముగ్గుల పోటీలకు పెట్టింది పేరు. మూడు రోజుల పండగ సందర్భంగా పల్లె, పట్టణం తేడా లేకుండా ముగ్గుల పోటీలు ఊపందుకున్నాయి. ప్రతి వార్డు, గ్రామం రంగవల్లులతో దర్శనమిచ్చాయి. మహిళలు వేసిన వివిధ రకాల ముగ్గులతో రహదారులు సుందరంగా దర్శనమిచ్చాయి. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మరోవైపు భోగి మంటలు, వరి ధాన్యం కుప్పలు, చెరకు గడలు, గంగిరెద్దులు, డూడూ బసవన్నల సందడి, పతంగులతో యువతీ యువకులు సందడి చేశారు.

- సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలు గుర్తుకువస్తాయి. అందులో కోడి పందేలకు పెట్టింది పేరు. వీటిని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జౌత్సాహికులు తూర్పుగోదావరి జిల్లాకు తరలివచ్చారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 100 వరకు కోడిపందేల బరులు నిర్వహించినట్లు సమాచారం. రూ.కోట్లలో నగదు చేతులు మారింది. పోలీసులు ఎంత కట్టడి చేసినా ఫలితం లేకుండా పోయింది. సంప్రదాయం ముసుగులో యథేచ్ఛగా కోడి పందేలు, గుండాట నిర్వహించారు. దేవరపల్లి, గోపాలపురం, పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల పరిధిలో పందేలు, గుండాట జోరందుకున్నాయి. రాజమండ్రి రూరల్‌, రాజమండి సిటీ, అనపర్తి, రాజానగరం తదితర ప్రాంతాల్లో కోడిపందేలు ఊపందుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే మూడు రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 20కి పైగా కోడిపందేల బరులు నిర్వహించారు. ఒక్కో పందెం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు సాగింది. త్యాజంపూడి గ్రామంలో రాత్రిపూట ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిర్వహించారు. పెరవలి మండలంలో పందెం కోడి కత్తికట్టింది. మండలంలో 10కి పైగా బరుల్లో కోడిపందేలు, గుండాట నిర్వహించారు. ఒక్క గుండాటలకే రూ.3 కోట్ల వరకు టర్నోవర్‌ అయినట్లు తెలిసింది. కోడిపందేల ద్వారా రూ.కోట్లల్లో నగదు చేతులు మారింది. కొవ్వూరు, రాజానగరం, రాజమండ్రి రూరల్‌, సిటీ మండలాల్లో సైతం యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహించారు.

తెగ తాగేశారు

సంక్రాంతి సందర్భంగా ఒక్కొక్కరు ఒక్కో సంతోషాన్ని వెతుక్కున్నారు. కొందరు మంచి ఆహారాన్ని ఆస్వాదించేందుకు రెస్టారెంట్ల బాట పట్టారు. దీంతో రాజమహేంద్రవరం నగరంలోని రెస్టారెంట్లన్నీ కిటకిటలాడాయి. మరి కొందరు మద్యంతో సంతోషంగా గడిపారు. జిల్లా వ్యాప్తంగా గతేడాది సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే ఈసారి మద్యం విక్రయాలు పెరిగాయి. మందుబాబులు ఆయా దుకాణాలకు, బార్‌ అండ్‌ రెస్టారెంట్లకు క్యూ కట్టారు. సాధారణ రోజుల్లో ఒక్కో మద్యం దుకాణంలో రూ.1.50 లక్షల విక్రయాలు జరుగుతాయి. అటువంటిది ఈ పండగల్లో ప్రతి రోజూ ఒక్కో దుకాణంలో రూ.4 లక్షల వరకూ విక్రయాలు జరిగినట్లు సమాచారం. సామర్లకోట, రాజమహేంద్రవరం, అమలాపురం బేవరేజస్‌ పరిధిలో 14 నుంచి 16వ తేదీ వరకు మద్యం విక్రయాలను పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుంది. మూడు బేవరేజస్‌ పరిధిలో 393 అవుట్‌లెట్లు ఉండగా.. 52,353(ఐఎంఎల్‌) ఇండియన్‌ మేడ్‌ లిక్కర్‌ కేసులు, 23,561 బీర్ల విక్రయాలు జరిగాయి. రూ.52.49 కోట్ల ఆదాయం వచ్చింది.

లండన్‌ నుంచి సొంతూరుకు..



లండన్‌ సిటీలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్న తాళ్లూరి దివ్యతేజ సంక్రాంతి సందర్భంగా భర్త శేషుబాబు, కుమారుడు నిశాంత్‌తో కలిసి దేవరపల్లిలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చారు. లండన్‌ నుంచి సొంతూరు దేవరపల్లికి వచ్చి పండగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం మంచి అనుభూతినిచ్చిందని అన్నారు. వారం రోజులు ఇక్కడే ఉండి కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. దివ్యతేజ తండ్రి దేవరపల్లిలో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. – తాళ్లూరి శేషుబాబు కుటుంబ సభ్యులు

ఏటా సంతోషంగా పాల్గొంటాం



గోదావరి చెంతనే ఉన్న మా పెండ్యాల గ్రామంలో సంక్రాంతి పండగకు రామాలయం వద్ద జరిగే ముగ్గుల పోటీలకు ఎంతో పేరుంది. ప్రతి ఏడాది నిర్వహించే ముగ్గుల పోటీల్లో చిన్నాపెద్ద తేడా లేకుండా మహిళంతా సంతోషంగా పాల్గొంటాం. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుకునే వాళ్లందరూ పండగ మూడురోజులు ఇక్కడికి రావడంతో ఆటపాటలతో కలిసి ఎంజాయ్‌ చేస్తాం. ఇంట్లో పిండి వంటల చేయడంతో పాటు మహిళలంతా ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గులు అందంగా వేస్తారు. కమిటీ సభ్యులు ఆకట్టుకునే ముగ్గులను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తారు. చిన్నారులంతా డ్యాన్స్‌ బేబి డ్యాన్స్‌, ఫ్యాన్సీ డ్రెస్‌ పోటీల్లో పాల్గొని అలరిస్తారు.

– మైనం విజయనాగలక్ష్మి, పెండ్యాల

క్లుప్తంగా

అయోధ్యలో ప్రదర్శనకు పుష్పాల బాపిరాజు వేసిన చిత్రం



సీటీఆర్‌ఐ: అయోధ్యలోని భవ్య రామ మందిరంలో ఈ నెల 22న ప్రాణప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనలో రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ పుష్పాల బాపిరాజు వేసిన తైల వర్ణ చిత్రానికి చోటు దక్కింది. రామమందిర ప్రాణప్రతిష్ఠలో తాను గీసిన చిత్రానికి అవకాశం దొరకడం చాలా ఆనందంగా ఉందని బాపిరాజు అన్నారు. నిర్వాహకుల నుంచి వర్తమానం బుధవారం వచ్చిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

20, 21 తేదీల్లో సీనియర్స్ రెజ్లింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో రాష్ట్ర స్థాయి సీనియర్స్ రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు, ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు బుధవారం తెలిపారు. ఈ పోటీలు పిఠాపురం రాజీవ్‌గాంధీ మున్సిపల్ స్కూల్ ఆవరణలో జరుగుతాయన్నారు. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని వివరించారు. ఇదిలా ఉంటే రెజ్లింగ్ పురుషులు, మహిళల విభాగాల్లో జిల్లా జట్టు ఎంపికలు గురువారం ఉంటాయన్నారు. పిఠాపురం రాజీవ్ గాంధీ మున్సిపల్ స్కూల్ ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. 20 ఏళ్లు పైబడిన వారు అర్హులని, ఆసక్తి ఉన్నవారు 94906 45859 ఫోన్ నంబరులో సంప్రదించాలని చెప్పారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ యాంటీపవర్ తెఫ్ట్ స్క్వాడ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె.నాగమోహనరెడ్డి హెచ్చరించారు. బుధవారం సీతానగరం మండలం నల్గొండ గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, కోళ్లఫారంలో మీటరు బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. కోళ్లఫారం యజమానికి రూ. 74,345 అపరాధ రుసుం, రూ.12,000 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

క్రీడా సంరంభానికి వేళాయె..

- అండర్-19 జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు సర్వం సిద్ధం
- 20 నుంచి 24 వరకూ నిర్వహణ
- 23 రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరు
- కాకినాడలో చురుగ్గా ఏర్పాట్లు



టెన్నిస్ పోటీలకు జేఎన్టీయూకేలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి తదితరులు



అండర్-19 టెన్నిస్ పోటీలకు సిద్ధం చేసిన డీఎస్ఏ సింథటిక్ టెన్నిస్ కోర్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడా సంరంభానికి వేళయ్యింది.. నువ్వా నేనా అనేట్టు సాగనుంది.. పాఠశాల విద్యా శాఖ పర్యవేక్షణలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్-19 లాన్ టెన్నిస్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చాలా ఏళ్ల తర్వాత కాకినాడ జిల్లాలో అండర్-19 జాతీయ స్థాయి పురుషుల టెన్నిస్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 20 నుంచి 24 వరకూ జిల్లా కేంద్రం కాకినాడ వేదికగా జరిగే ఈ పోటీలకు 23 రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి క్రీడాకారులు, 109 మంది క్రీడాకారులు, 52 మంది కోచ్‌లు, మేనేజర్లు, 105 మంది రాష్ట్ర, జిల్లా స్థాయి టెక్నికల్ అఫీషియల్స్ హాజరు కానున్నారు. పోటీల నిర్వహణకు పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి, రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి భానుమూర్తిరాజు పర్యవేక్షణలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాకినాడలో జిల్లా క్రీడా మైదానం, డీమార్ట్ సమీపంలోని మున్సిపల్ టెన్నిస్ కోర్టులు, పాత ఎస్పీ ఆఫీస్ వెనుక టెన్నిస్ కోర్టులను నిర్వాహకులు పోటీల నిర్వహణకు సిద్ధం చేశారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాల నుంచి హాజరవుతున్న క్రీడాకారులకు వసతి నిమిత్తం డీఎస్ఏ ఇండోర్ స్టేడియం, జేఎన్టీయూకే గెస్ట్ హౌస్, ప్రైవేట్ వసతి గృహాలు, లాడ్జీలను సిద్ధం చేశారు. బుధవారం ఆర్జేడీ నాగమణి ఆయా వసతి భవనాలను సందర్శించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. భోజన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి. జాతీయ ప్రమాణాలతో కోర్టులను తీర్చిదిద్దారు. సుమారు 16 ఏళ్ల తర్వాత కాకినాడ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు జరుగుతుండడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ఈ ఏడాది పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో క్రీడాకారులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, జేసీ ఇలక్కియ ఇప్పటికే పలుమార్లు పోటీల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. క్రీడాకారులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ భానుమూర్తి రాజు, సమాఖ్య కార్యదర్శి ప్రసాద్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ పోటీల నిర్వహణ ఏర్పాట్లు బుధవారం నుంచి పర్యవేక్షించారు. జిల్లా క్రీడా మండలి, వైద్య ఆరోగ్య, విద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో పోటీలు విజయవంతం అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



కాకినాడలో విద్యాశాఖ పర్యవేక్షణలో ఈ నెల 20 నుంచి 24 వరకే జరగనున్న జాతీయ స్థాయి అండర్-19 టెన్నిస్ పోటీలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పోటీల నిర్వహణపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ సమీక్షలు నిర్వహించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోటీల ఏర్పాట్లు జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో చురుగ్గా జరుగుతున్నాయి.

– నాగమణి, ఆర్జేడీ, కాకినాడ జిల్లా విద్యాశాఖ

16 ఏళ్ల తర్వాత అవకాశం



పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 2007, 2008 సంవత్సరాల్లో ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలు జిల్లాలో నిర్వహించారు. తిరిగి 16 ఏళ్ల తర్వాత కాకినాడలో జాతీయ స్థాయి అండర్-19 పురుషుల టెన్నిస్ పోటీల నిర్వహణకు అవకాశం వచ్చింది. దీంతో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేశాం.

– ప్రసాద్, పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

జిల్లాలో 1,031 మంది అరెస్ట్

అమలాపురం టౌన్: సంక్రాంతి సందర్భంగా జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి పోలీసు శాఖ గత సంవత్సరం డిసెంబర్ 26వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకూ పలు ముందస్తు చర్యలు చేపట్టింది. కోడి పందేలు, జూదాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి జిల్లాలో మొత్తం 373 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం తెలిపింది. ఈ కేసుల్లో మొత్తం 1,031 మందిని అరెస్ట్ చేశారు. 363 కోళ్లను, 456 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందస్తుగా జిల్లాలో 1,370 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మొత్తంగా ఈ కేసుల్లో ఆరు వాహనాలతో పాటు రూ.10.79 లక్షల నగదును సీజ్ చేశారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు సంక్రాంతి సందర్భంగా అశ్లీల నృత్యాలను పూర్తిగా అదుపు చేశారు. ప్రత్యేక పోలీసు టీమ్‌ల ద్వారా ఈ దాడులు నిర్వహించారు. గత ఏడాదితో పోల్చుకుంటే సంక్రాంతి సందర్భంగా క్రైమ్ రేటును తగ్గించేందుకు జిల్లా పోలీసు శాఖ చేసిన కృషి సానుకూల ఫలితాలను ఇచ్చింది.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరికి వినతి పత్రం ఇస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

అల్లవరం: దీర్ఘకాలంగా అమలుకు నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగులు వ్యవసాయ మరియు సహకార శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరికి తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. సహకార సంఘాల్లో 2019 నుంచి విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. జీఓ నెంబరు 36, 60 నుంచి 62 వరకూ ఉన్న జీవోలను అమలు చేయాలన్నారు. గతంలో సహకార సంఘాల్లో పనిచేసిన కాలానికి జీతాలు రిలీజ్ చేయాలని కోరినట్లుగా సహకార సంఘాల ప్రతినిధులు కె.తిరుమలరావు, కొమ్మూరి సత్తిబాబు తెలిపారు. సహకార సంఘాల ఉద్యోగుల పెండింగ్ సమస్యల తీర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎస్సైకు తీవ్ర గాయాలు

ఆత్రేయపురం: గతంలో ఆత్రేయపురం ఎస్సైగా పనిచేసిన సీహెచ్ సుధాకర్‌ను లొల్లలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక పోలీసు స్టేషన్‌లో పూర్వ ఎస్సైగా పనిచేసిన సుధాకర్ ప్రస్తుతం అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్నాడు. ఈ నెల 16న విధులు ముగించుకుని ఆత్రేయపురం వస్తుండగా లొల్ల లాకుల సమీపాన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనకు తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై సుధాకర్ కుమారుడు ప్రసూద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై బీవై కిరణ్‌కుమార్ వివరించారు.

విజయదుర్గా పీఠంలో ఆధ్యాత్మిక శోభ

అట్టహాసంగా 'గాడ్' జన్మదిన వేడుకలు ప్రారంభం



పీఠంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



పీఠాధిపతి గాడ్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేద పండితులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠం బుధవారం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) 88వ జన్మదిన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గాడ్ కుమార్తె సత్యవెంకటకామేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. తిరుపతికి చెందిన వైఖానస పండితుడు సాయి ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ స్వామికి అభిషేకాలు, అర్చనలు, మహా సుదర్శన హోమం, పూర్ణాహుతి జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పీఠంలోని విజయదుర్గమ్మ వారిని నయనానందకరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు గణపతి హోమం, గరిక పూజ, బిల్వపత్ర పూజ, నక్షత్ర జపం, నవగ్రహ పూజ, ఏకవార రుద్రాభిషేకంతో మహా మత్యుంజయ హోమం, మన్యుసూక్త పారాయణ నిర్వహించారు. విజయదుర్గమ్మ వారికి దుర్గా అష్టోత్తర, సహస్ర నామావళి, దుర్గా ద్వాత్రింశ నామావళి, దేవీ శక్తిమాల అష్టోత్తరాలతో అమ్మవారిని పూజించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

పీఠంలో సాయంత్రం ఆరు గంటల సమయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి ఆలయానికి చెందిన అర్చకుడు గోపి గురుకుల్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం చేపట్టారు. ఈ సందర్భంగా విజయదుర్గా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ ధర్మాన్ని రక్షిస్తే అది తిరిగి మనల్ని రక్షిస్తుందన్నారు. మనుషుల్లో మానవతా విలువలను మేల్కొలపడానికి, ఆధ్యాత్మిక చింతనకు, లోక కల్యాణార్థం పీఠంలో కల్యాణాలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వేణుగోపాల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాల్లో ఆధ్యాత్మికవేత్త కోట సునీల్‌కుమార్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, బి.రమ, పి.సత్యకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో సత్తా చాటాలి



ఉమ్మడి జిల్లా బాలికల కబడ్డీ జట్టు



బాలుర కబడ్డీ జట్టు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్లు ప్రథమ స్థానం సాధించాలని స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆకాంక్షించారు. ఈ నెల 20 నుంచి 23 వరకూ నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా బాలుర, బాలికల జట్ల ఎంపికను దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ప్రారంభించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ ఎంపిక జరిగింది. ఇందులో బాలిక జట్టుకు ఎం.అరుణ, వి.మంజులారాణి, డి.శివమణి, బి.మాధురి, కె.అరుణశ్రీ, టి.అపరంజిత, ఒ.వాత్సల, ఒ.జాహ్నవి, వై.కీర్తి, కె.ఆశిక, టి.అనంత, సీహెచ్ వాణి, సీహెచ్ లోవకుమారి ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా కబడ్డీ బాలుర జట్టుకు ఆర్.సాయిరామ్, ఎం.శ్రీహరి, ఎ.మణికంత, పి.నాగబాబు, వి.దుర్గాప్రశాంత్, పి.హరీష్, కె.మనోహర్, వడ్లమూరు, జి.హరీష్, ఎస్.అవినాష్, ఎ.జయరాజ్, ఎన్.చక్రధర్, చిన తిరుపతి ఎంపికయ్యారు. సెలక్షన్ కమిటీ సభ్యులు సీహెచ్ మణికంత, సి.ప్రసాద్, ఎ.నవీన్‌రాజు, ఉబా కెనడీ, పీఈటీలు మట్టా సుబ్బారావు, పోలారావు, ఎస్.ఉమామహేశ్వరరావు, ఎండీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండగ రోజు విషాదం



చిట్టూరి రమేష్ (ఫైల్)

సీతానగరం: పండగకు కొత్త అల్లుడు అత్తారింటికి వెళ్లి షటిల్ ఆడుతూ కుప్పకూలిన ఘటన కనుమ రోజున చోటుచేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. రఘుదేవపురం గ్రామానికి చెందిన చిట్టూరి రమేష్ (32)కు బొబ్బిల్లంకకు చెందిన సీతారత్నం కుమార్తె శ్రావణితో ఎనిమిది నెలల కిందట వివాహం జరిగింది. తొలిసారి పండుగకు బొబ్బిల్లంకలోని అత్తారింటికి వెళ్లి మంగళవారం ఉదయం షటిల్ ఆడుతూ రమేష్ ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. ఏమైందో తెలియక అక్కడి వారు సపర్యలు చేసినా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికంగా వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో వెంటనే కారులో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పండగ వేళ ఇలా జరగడంతో అత్త సీతారత్నం, భార్య శ్రావణి, తండ్రి అన్నంరాజు, తల్లి, తమ్ముడు బోరున విలపించారు. ఈ ఘటన స్థానికులను కంట తడి పెట్టించింది.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి



సామర్లకోట సీహెచ్‌సీ వద్ద రాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడు మిర్యాల రాజు (45) మృతి చెందాడు. స్థానిక మఠం సెంటర్‌లో మస్తరు వేసుకుని మెహర్ కాంప్లెక్స్ సమీపంలోని వార్డులో విధులు నిర్వహించేందుకు వెళుతున్న సమయంలో ఎదురుగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి పారిశుధ్య కార్మికులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రాజును తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందిన్నట్లు ఆస్పత్రి సిబ్బంది ధ్రువీకరించారు. మృతదేహాన్ని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, రెడ్నం దొరబాబు, పెండ్యాల అబ్బు, పారిశుధ్య కార్మిక సంఘ అధ్యక్షుడు మచ్చా రాజు తదితరులు పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇటీవల వివాహం చేశారు.

తాపీమేస్త్రి దుర్మరణం

ప్రత్తిపాడు: జాతీయ రహదారి ప్రత్తిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామ ఉలిసివారి వీధికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఉలిసి శ్రీను (35) బైక్‌పై ప్రత్తిపాడు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. స్థానిక అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలచర్లలో అడవి జంతువు సంచారం!

రాజానగరం: మండలంలోని పాలచర్ల- గాడాల గ్రామాల మధ్య హైనా అనే అడవి జంతువు సంచరిస్తుందని ప్రచారం జరుగుతెంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. హైనా సంచారం విషయమై మాజీ ఎంపీ హర్షకుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై అటవీ శాఖ అధికారులు స్పందించారు. బుధవారం ఆయా ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఎక్కడా దాని జాడ కానరాలేదు. దీనిపై ఆయా ప్రాంతాల్లోని రైతులను అప్రమత్తం చేస్తూ, జాడ తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు అన్నారు.

ముందస్తుగా వరి నాట్లు వేసుకోవాలి



అనాతవరం రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ముమ్మిడివరం: పంట, మురుగునీటి కాలువల మరమ్మతుల దృష్ట్యా ముందస్తుగా కాలువల్లో నీటి విడుదలను నిలుపుదల చేయాల్సిన అవసరం ఉండడంతో, ఆ దిశగా రైతులు రబీ సాగు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ముమ్మిడివరం మండలం అనాతవరం రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులు, రైతు భరోసా సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో నిర్వహించిందీ లేనిదీ ఆరా తీయగా, ఇప్పటికే పూర్తయ్యిందని సిబ్బంది తెలిపారు. రబీ సీజన్‌కు ఎరువుల సరఫరా, ఈ-క్రాప్ బుకింగ్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. మాగాం- అనాతవరం, మాగాం- సీహెచ్ గున్నేపల్లి పంట కాలువల మరమ్మతులకు ఎక్కువ అవకాశాలు ఉండడంతో పంట కాలాన్ని కుదించుకుని సహకరించాలని కలెక్టర్ కోరారు. జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, సహాయ సంచాలకులు వెంకట రామారావు, మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



ఎస్.యానం తీర ప్రాంతంలో పర్యాటకుల సందడి

ఉప్పలగుప్తం: మండల తీర ప్రాంతమైన ఎస్.యానం సముద్ర తీరంలో బుధవారం పర్యాటకులు సందడి చేశారు. సంక్రాంతి పండగ సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సముద్ర తీరంలో కుటుంబాలతో ఆహ్లాదంగా, ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు గాలి పటాలను ఎగురవేస్తూ ఆడి పాడారు. సముద్ర కెరటాల్లో కేరింతలు కొడుతూ స్నానాలు చేశారు. బుధవారం ఉదయం నుంచి యువత కబడ్డీ, క్రికెట్ వంటి ఆటలు ఆడడంతో పాటు విందు, వినోదాల్లో మునిగి తేలారు.